క్లుప్తంగా

మంత్రి నాగార్జునను కలిసిన వెంకటేష్



మంత్రి నాగార్జునతో వెంకటేష్

చీరాల: ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జునను ఆదివారం ఒంగోలులో వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. అలానే మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి కొద్ది సేపు మాట్లాడారు.

గ్రామ దేవతలకు పూజలు

బల్లికురవ: శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా మండలంలోని వాడవాడలా గ్రామ దేవతలకు విశేష పూజలు చేపట్టారు. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్ల కొండకు దిగువభాగంలో వేంచేసి ఉన్న ఈర్ల గంగమ్మ వద్దకు బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, మల్లాయపాలెం గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. బల్లికురవ, గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, కొనిదెన, చెన్నుపల్లి కొండాయపాలెం గ్రామాల్లోని గ్రామ దేవతలైన పోలేరమ్మ, అంకమ్మ, మహాలక్ష్మమ్మ, రేణుకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. వరుణుడు కరుణించి పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు.

నేడు ఇడుపులపాడులో గడప గడపకు..

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇడుపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం 1, 2 పరిధిలో గడపగ డపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం, మండల కన్వీనర్ బండారు ప్రభాకర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయణం, నిజ శ్రావణ మాసం, రేవతి నక్షత్రం, చవితి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని సంతమాగులూరు శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ బాదం విజయ భాస్కరరెడ్డి అన్నారు. చదవడం మాకిష్టం ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కౌసల్ యోజనపై అవగాహన

గిద్దలూరు రూరల్: ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌసల్ యోజన పథకంపై విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి మోదీ సంప్రదాయ చేతి వృత్తుల వారి అభివృద్ధి కోసం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. వసంతాచారి, నల్లగట్ల వీర బ్రహ్మాచారి, వీరభద్రాదిచారి, చంద్రశేఖర్‌ఆచారి పాల్గొన్నారు.

వాన రాకతో రైతు కళ్లల్లో ఆనందం



పంగులూరులో కురుస్తున్న వర్షం



బల్లికురవలో కురుస్తున్న వర్షం

జే.పంగులూరు: మండలంలోని గత రెండు రోజుల కురుస్తున్న తేలిక పాటి వర్షాలకు పంటలకు ప్రాణం పోసినట్లయింది. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ సీజన్‌కుగాను 500 ఎకరాల పైచిలుకు మిర్చి, 300 ఎకరాల పైచిలుకు మినుము, 100 ఎకరాలు మేర మొక్కజొన్న, 50 ఎకరాల మేర పత్తి సాగు చేశారు. గత నెల సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. రైతులు ఇక వర్షాలు పడవని పంటలపై ఆశలు వదిలేశారు. కాని గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులకు ఆశలు చిగురించాయి.

బల్లికురవ: ఆకాశం మేఘావృతంతో ఆదివారం సాయంత్రం మండలంలో చిరుజల్లులతో వర్షం కురిసింది. ఈ వర్షంతో మండలంలోని కొప్పెరపాలెం, మల్లాయపాలెం, వేమవరం, గంగపాలెం, సోమవరప్పాడు, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, అంబడిపూడి, బల్లికురవ గ్రామాల్లో సాగుచేసిన మెట్ల పైర్లు పత్తి, మిర్చి, నువ్వు పైర్లు జీవం పోసుకుంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా వర్షాలు లేక ఎదుగుదల లేని పైర్లకు కొంత మేర ఉపశమనం లభించిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అద్దంకిలో భారీ వర్షం..

అద్దంకి రూరల్: గత కొన్ని రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక ఎండలు కాస్తూ ఇబ్బందిగా ఉండేది. సాయంత్రానికి అద్దంకిలో వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురిశాయి. ఇదే క్రమంలో ఆదివారం అద్దంకిలో మధ్యాహ్నం నుంచే మేఘావృతమై మూడు గంటలపాడు భారీ వర్షం కురిసింది. వర్షంతో పట్టణంలోని లోతట్టు కాలనీలు జలమయయ్యాయి. పట్టణంలోని నామ్ రహదారిపై కొంత సమయం రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.



మేదరమెట్లలో జోరుగా కురుస్తున్న వాన



మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో నిలిచిన నీరు



ముక్తేశ్వరంలో ఓ వీధిలోకి చేరిన నీరు



ఇంకొల్లులో రోడ్డులో జోరుగా కురుస్తున్న వర్షం

అధికారుల నిర్లక్ష్యం-పారిశుధ్యం అధ్వానం

- విజృంభిస్తున్న దోమలు
- ఫాగింగ్ మిషన్ల కొనుగోలులో అధికారులు అలసత్వం

చీరాల టౌన్: గ్రామాల అభివృద్ధికి సెక్రటరీలు బాధ్యతగా పనిచేయాలి. వర్షాకాలం మొదలైంది.. దోమలు వ్యాప్తి చెందకుండా గట్టి జాగ్రత్తలు తీసుకోండి, ప్రజలు రోగాల బారినపడకుండా చూడాల్సిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తరచూ మండల పరిషత్ అధికారులు వల్లె వేసే మాటలివే. కానీ ఆచరణలో మాత్రం వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో 24 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం ఆరు గ్రామ పంచాయతీలకు మినహా మిగిలిన గ్రామాలకు దోమలను నిర్మూలించే ఫాగింగ్ మిషన్లు లేక పోవడమే అందుకు నిదర్శనం. గ్రామాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రంతో రోడ్లు, మురుగు నీరుతో నిండి ఉన్నాయి. చీరాల మండలంలో 15 పంచాయతీల్లో ఈపూరుపాలెం, దేవాంగపురి, గవినివారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయతీలు మేజర్ పంచాయతీలు. మిగిలినవి 11 మైనర్ పంచాయతీలు. మండలంలో 23981 నివాసగృహాలు ఉన్నాయి. మండల జనాభా 85,696 మంది ఉన్నారు. మండలంలోని అన్నీ గ్రామాలకు సాధారణ నిధులు ఉన్నాయి. గ్రామాలకు నిధులు ఉన్నప్పటికి వాటిని ఖర్చు చేసేందుకు కార్యదర్శులు విముఖత చూపుతున్నారు. ప్రతి పంచాయతీకి ఉన్న నిధులతో ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసి దోమలు నిర్మూలన చేయాల్సి ఉండగా మండల, గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం వచ్చిన డెంగీ, విషజ్వరాలకు చీరాల మండలంలోని తోటవారిపాలెం, దేవాంగపురి, రామకృష్ణాపురం గ్రామాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.



గవినివారిపాలెంలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

అప్పట్లో హడావుడి చేసిన వైద్య, ఆరోగ్య అధికారులు, పంచాయతీ పాలకులు పక్క మండలంలో ఉన్న ఫాగింగ్ మిషన్లు తీసుకొచ్చి రెండు రోజులు పాటు ఫాగింగ్ చేశారు. ఆ తర్వాత అయినా మండల అధికారులు తమ మొద్దు నిద్రను విడనాడిన దాఖలాలు లేవు. ఒక్కో మిషన్ కొనుగోలుకు రూ.75 వేలు మాత్రమే అవుతుందని తెలిసినా పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు అంటున్నారు.

ఎంపీడీవో నేతాజీ ఏమంటున్నారంటే..

ఈవిషయమై మండల పరిషత్ అభివృద్ధి అధికారి నేతాజీని వివరణ కోరగా మండలంలో గాంధీనగర్, ఈపూరుపాలెం, దేవాంగపురి గ్రామ పంచాయతీలు మాత్రమే ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. మిగిలిన అన్నీ గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేయాలని సూచించాం. ప్రతి గ్రామ పంచాయతీకి ఈ మిషన్లు ఉంటేనే దోమలను అరికట్టవచ్చు. కొద్ది రోజుల్లోనే మిగిలిన అన్నీ గ్రామ పంచాయతీలు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

'వడలి'ని వరించిన కథా పురస్కారం



వడలి రాధాకృష్ణ

చీరాల అర్బన్: హరివిల్లు చిత్తూరు లలిత కళావేదిక, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం చిత్తూరి వారి సాహితీ మహోత్సవ సభలో ప్రదానం చేస్తున్న శ్రీమతి శాంతాబాయి, శ్రీధరరావు సాహితీ పురస్కారాన్ని చీరాలకు చెందిన కథారచయిత వడలి రాధాకృష్ణకు ప్రదానం చేస్తున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా కథారచయితగా సహజ సాహితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా సాహితీసేవ చేస్తున్న ఆయనకు ఈనెల 10న పురస్కారాన్ని అందిస్తున్నట్లు ప్రతినిధులు ఆదివారం తెలిపారు. పురస్కారాన్ని అందుకోబోతున్న సందర్భంగా ఆయనన పట్టణానికి చెందిన ప్రముఖులు అప్పాజోస్యుల సత్యనారాయణ, బత్తుల బ్రహ్మారెడ్డి, డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, వలివేటి మురళీకృష్ణ, మువ్వల శివప్రసాదరావు, బీరం సుందరరావు, భాగి కృష్ణమూర్తి, మంత్రి కృష్ణమోహన్, సజ్జా వెంకటేశ్వర్లు, కొణికి చంద్రశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు.

హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్ షబానా

పర్చూరు(చినగంజాం): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి గ్రామ వలంటీర్ తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛను అందించి తన సేవను చాటుకుంది. ఉప్పుటూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు షేక్ సారాబి అనారోగ్యంతో బాధపడుతూ చిలకలూరిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ షేక్ షబానా ఆమెకు పింఛను అందించాలనే సంకల్పంతో ఆసుపత్రికి వెళ్లి అందజేసింది. సచివాలయ పరిధిలోని పలువురు వలంటీర్ సేవలను పలువురు కొనియాడారు.

367 పింఛన్లు మంజూరు..

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో నూతనంగా నమోదు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి 367 పింఛన్లను అప్‌డేట్ చేశామని, వీటిలో 167 మంజూరు కాగా మిగిలినవి కూడా రెండు రోజుల్లో మంజూరు చేస్తామని ఎంపీడీవో సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలతో లబ్ధి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: లబ్ధిదారుల ఇంటికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం-4 సచివాలయం పరిధిలోని యూసఫ్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, వాటిపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాల పథకాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అన్ని హామీలను 95 శాతం మేర అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమాన్ని చూడలేకనే ప్రతిపక్షాలు కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బోయిన కేశవులు, ఎర్రాకుల బాపిరాజు, కోటి రవి, బిట్రా శ్రీను, చప్పిడి వెంకటేశ్వర్లు, జంగిలి ఏసు, నక్కల యానాది, చప్పిడి రామచంద్ర యాదవ్, ఎర్రాకుల శ్రీను, బోయిన కృష్ణ, పాలపర్తి నాగేశ్వరరావు, ఆసాది అంకాలరెడ్డి, పి.ధనుంజయ, గుంటూరు వెంకట సుబ్బారావు, పెరుగు ఏడుకొండలు, జగదీష్, శ్రీను, ఎం.కృష్ణ, షేక్ మస్తాన్, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి జబ్బులపై అశ్రద్ధ వద్దు

చీరాల అర్బన్: వృద్ధాప్యంలో వచ్చే కంటి జబ్బుల పట్ల అశ్రద్ధ వహించకుండా తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని చీరాల ఏరియా వైద్యశాల కంటి వైద్యులు పి.రాజ్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చీరాలలో ఆరోగ్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో కంటి చూపు కోల్పోకుండా ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. చీరాల ఏరియా వైద్యశాలలో నూతన శస్త్ర పరికరాలతో కంటి శస్త్రచికిత్స ఆపరేషన్లు చేస్తున్నామని, ఈ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి వైద్యులు పి.రాజ్‌కుమార్‌ను అంగలకుదిటి పార్వతీశం ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమానికి గాదె హరిహరరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాద్రి యల్లమందారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగవీరభద్రాచారి, కార్యదర్శి రామారావులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్

స్పందనకు అధికారులు హాజరు కావాలి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల దినం 'స్పందన' కార్యక్రమానికి అన్నీ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేశారని తహశీల్దార్ తెలిపారు. అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా స్పందనకు హాజరుకావాలన్నారు. అలానే మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు.

వానలు కురవాలి వాన దేవుడా..

- పొంగళ్లు సమర్పించిన ప్రజలు

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం వర్షాలు కురవాలి వానదేవుడా.. పంటలకు మేలు చేయాలి వానదేవుడా అంటూ గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ దేవతలు అయిన పోలేరమ్మ తల్లి, గంగమ్మ తల్లి, పోతురాజులకు స్థానిక రెడ్ల బజారుకు చెందిన మహిళలు చీరె, సారెలతో నైవేద్యం సమర్పించారు. పొంగళ్లను తలపై ఉంచుకొని గ్రామంలో ఊరేగింపుగా గ్రామ పొలిమేరలో ఉన్న దేవతల చెంతకు వెళ్లి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు, అనంతరం గ్రామస్తులంతా కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం గ్రామంలో భారీ వర్షం కురవడం కొసమెరుపు.



గ్రామ దేవతలకు ఊరేగింపుగా వెళ్లి పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు

బల్లికురవ: ప్రభుత్వం జగనన్న కాలనీలకు మంజూరుచేసి పక్కాగృహాల లబ్ధిదారులు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, గృహనిర్మాణ సంస్థ ఏఈ దుర్గా రమేష్ ఆదివారం కోరారు. మండలంలోని 13 లేఅవుట్‌లో 182 గృహాలు గ్రౌండింగ్ చేశామని వీరిలో 90 గృహాలు పూర్తయ్యాయని, గృహంతో పాటు ఇంకుడు గుంత నిర్మాచుకోవాలన్నారు. రాబోయే కాలంలో నీటి ఎద్దడులు తలెత్తకుండా భూగర్భ జలమట్టం పెంపునకు ఇంకుడు గుంత ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 వేలు చెల్లిస్తుందని వైదన, బల్లికురవ గ్రామాల్లో ఇంకుడు గుంత నిర్మాణానికి లబ్ధిదారులకు అవగాహన కల్పించామన్నారు. మిగిలిన గ్రామాల్లో తక్షణమే ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని కోరారు.



ఇంకుడు గుంత నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో, ఏఈ

శింగరకొండ ఈవోకు సత్కారం



ఈవోను సత్కరిస్తున్న అద్దంకి బ్రాహ్మణ సంఘం నాయకులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం సహాయ కార్య నిర్వహణాధికారిణిగా టి. సుభద్ర బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా అద్దంకి బ్రాహ్మణ సంఘం ఆదివారం ఘనంగా సత్కరించారు. దేవస్థాన అభివృద్ధికి ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జమ్మల మడుగు హనుమంతరావు, రమాదేవి, ప్రధానకార్యదర్శి శివప్రసాద్, ఐ. నాగరాజు, ఉపాధ్యక్షుడు వామరాజు వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖరరావు, వేద పండితుడు వంగల హరిశంకర పాల్గొన్నారు.

ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య



ప్రత్యేక పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విఘ్నేశ్వరుడు, అభయాంజనేయస్వామి, నాభిశిల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్‌నెట్‌చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాదెండ్ల దశరథరామయ్య, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.